సాక్షి
అనంతపురం

సోమవారం । 14 । ఏప్రిల్ । 2025



ఘనంగా రథోత్సవం

గుంతకల్లు మండలంలోని నాగసముద్రం గ్రామంలో ఆదివారం కదిరప్ప స్వామి రథోత్సవం ఘనంగా జరిగింది. 8లో



సంక్షోభంలో రవాణా రంగం

ఎంతోమంది కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న రవాణా రంగం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి కారణంగా సంక్షోభంలో కూరుకుపోతోంది. 8లో

గరిష్టం/కనిష్టం
38.9°/21.4°

జిల్లా అంతటా ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం కొనసాగింది. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

సజావుగా ఫ్లాగ్‌షిప్ పరీక్ష



అభ్యర్థులను తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి పంపిస్తున్న పోలీసులు

అనంతపురం అర్బన్:యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఆధ్వర్యంలో ఆదివారం ఫ్లాగ్‌షిప్ పరీక్షలు సజావుగా జరిగాయి. సీడీఏ పరీక్షకు అభ్యర్థుల హాజరు శాతం 45.07, ఎన్‌డీఏ పరీక్షకు 65.42 శాతం నమోదైంది. అనంతపురం కేఎస్ఎన్ పీజీ మహిళా కళాశాలలో నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ), నావెల్ అకాడమీ (ఎన్ఏ), ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాలలో కంబైన్డ్ డిఫెన్స్ అకాడమీ (సీడీఏ) పరీక్షలు నిర్వహించారు. రెండు సెషన్లుగా ఉదయం, మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు పోలీసులు పటిష్ట బందోబస్తు కల్పించారు. సీడీఏ పరీక్షకు 94 మంది హాజరవ్వాల్సి ఉండగా పేపర్-1కు 41 మంది,పేపర్-2 కు 48 మంది హాజరయ్యారు. పేపర్-3 పరీక్షకు 37 మందికి 15 మంది హాజరయ్యారు. ఎన్‌డీఏ, ఎన్ఏ పరీక్షకు 269 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా.. పేపర్-1కు 178, పేపర్-2కు 174 మంది హాజరయ్యారు.ఎం.రామ్మోహన్,డి.తిప్పే నాయక్‌లు పరీక్షలను పర్యవేక్షించారు.

ప్రశాంతంగా గురుకులాల ప్రవేశ పరీక్ష

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు ఆదివారం రాత పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 5వ తరగతి ప్రవేశానికి 7,595 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 6,972 మంది హాజరయ్యారు. 625 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్‌లో ప్రవేశానికి నిర్వహించిన పరీక్షకు 4,945 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 4,099 మంది హాజరయ్యారు. 847 మంది గైర్హాజరయ్యారు. బి.పప్పూరు, కొర్రపాడు, కురుగుంట స్కూళ్లలో కేంద్రాలను రాష్ట్ర పరిశీలకులు క్లారెన్స్ రాజు పరిశీలించారు. కురుగుంట కళాశాల కేంద్రంతో పాటు తిమ్మాపురం, అమరాపురం, నల్లమాడ పాఠశాలల కేంద్రాలను అంబేడ్కర్ గురుకుల పాఠశాలల ఉమ్మడి జిల్లా సమన్వయకర్త జయలక్ష్మీ పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు.

నేడు ఫిర్యాదుల స్వీకరణ ఉండదు

అనంతపురం అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ఫిర్యాదుల స్వీకరణ ఈ సోమవారం ఉండదని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ప్రభుత్వం సెలవు ప్రకటించిందని, ఈ నేపథ్యంలో కలెక్టరేట్‌లో జరగాల్సిన ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని రద్దు చేశామన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి వ్యయ ప్రయాసలకోర్చి జిల్లా కేంద్రానికి రావొద్దని సూచించారు.

వృద్ధ దంపతుల ఆత్మహత్య

- అనారోగ్యంతో మనస్తాపం చెంది బలవన్మరణం



మృతి చెందిన దేవా శివానంద,శాంతమ్మ

అనంతపురం: అనారోగ్యంతో మనస్తాపం చెందిన వృద్ధ దంపతులు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. అనంతపురం త్రీటౌన్ సీఐ కే.శాంతిలాల్ తెలిపిన మేరకు.. శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం వీవర్స్ కాలనీ చెందిన దేవా శివానంద (70), దేవా శాంతమ్మ (60) దంపతులు. వీరికి దేవా గోపాల్, దేవా చంద్రశేఖర్ సంతానం కాగా, హిందూపురంలో కుమారులు ఒక చోట, తల్లిదండ్రులు మరో చోట నివాసం ఉంటున్నారు. ప్రైవేట్ కంపెనీలో మేనేజర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన శివానందకు ఇటీవల షుగర్ ఎక్కువైంది.కిడ్నీ కూడా దెబ్బతినడంతో అనంతపురం సవేరా ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నారు. అయినప్పటికీ ఆరోగ్యం కుదుటపడలేదు. శాంతమ్మ కూడా షుగర్ వ్యాధితో బాధపడేవారు. ఈ క్రమంలోనే ఈ నెల 11న దంపతులిద్దరూ ఇంటికి తాళం వేసి అనంతపురం చేరుకున్నారు. నగర సమీపంలోని నేషనల్ పార్కు వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయారు. గుర్తించిన స్థానికులు వెంటనే ఇద్దరినీ అనంతపురం ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తరలించగా, చికిత్స ఫలించక శివానంద అదే రోజు ప్రాణాలు విడిచారు. శాంతమ్మ ఆదివారం మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

చేదెక్కిన చీనీ..



'అనంత' రైతులకు ఒకప్పుడు లాభాల తీపి పంచిన చీనీ ఇప్పుడు చేదెక్కింది. మంచి ధర కోసం వారాలు, నెలల తరబడి కాయలు కోయకుండా ఎదురుచూసినా ఫలితం కానరాకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. మార్కెటింగ్ పరిస్థితి దారుణంగా ఉన్నా కూటమి సర్కారు నుంచి స్పందన లేకపోవడంతో రైతుల ఆవేదన వర్ణనాతీతంగా మారింది.

- ధరలు మరింత పతనం
- గతంలో ఎన్నడూ లేని విధంగా దారుణ పరిస్థితులు
- రైతుల్లో తీవ్ర ఆందోళన



అనంతపురం మార్కెట్‌యార్డులో చీనీ క్రయ విక్రయాలు

అనంతపురం అగ్రికల్చర్: రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో చీనీ తోటలు ఉన్నాయి. అనంతపురం జిల్లాలో 93 వేల ఎకరాలు, శ్రీ సత్యసాయి జిల్లాలో 37,250 ఎకరాల భారీ విస్తీర్ణంలో చీనీ పంట సాగవుతోంది. వాటి ద్వారా ఏటా 7.20 లక్షల టన్నుల మేర దిగుబడి వస్తోంది. ఏటా సరాసరి రూ.2,000 కోట్ల నుంచి రూ.2,200 కోట్ల టర్నోవర్ ఉన్నట్లు ఉద్యానశాఖ గణాంకాలు చెబుతున్నాయి. అనంతపురం జిల్లాలోని గార్లదిన్నె మండలంలో 18 వేల ఎకరాలు, యల్లనూరు 11,296, కూడేరు 9,300, పామిడి 5,300, నార్పల 5,200, పుట్లూరు 5 వేలు, ఆత్మకూరు 4,200, అనంతపురం 3,900, పెద్దపప్పూరు 3,500 ఎకరాల్లో చీనీ తోటలు ఉన్నాయి. శ్రీ సత్యసాయి జిల్లాలో తాడిమర్రి, బత్తలపల్లి, ధర్మవరం, ముదిగుబ్బ, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి తదితర మండలాల్లో చీనీ అత్యధికంగా సాగులో ఉంది.

ఢిల్లీ, ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి..

ఉమ్మడి జిల్లాలో పండించే చీనీలో 70 నుంచి 80 శాతం వరకు ఢిల్లీలో ఉన్న అజాద్‌పూర్ మార్కెట్‌కు, ఆ తర్వాత రాజస్థాన్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు ఎగుమతి అవుతుంది. అయితే ఈ సారి మహారాష్ట్ర, తెలంగాణ నుంచి ఎక్కువ దిగుబడి రావడంతో వ్యాపారులు అక్కడికి వెళుతున్నట్లు చెబుతున్నారు. ఈ క్రమంలో ఢిల్లీ, పరిసర ప్రాంతాల మార్కెట్లకు సరుకు విపరీతంగా వెళుతుండటంతో సమస్య ఉత్పన్నమవుతోందని మార్కెట్‌యార్డు ఉన్నతశ్రేణి సెక్రటరీ కె.గోవిందు తెలిపారు. ఇటీవల జిల్లా నుంచి అక్కడకు వెళ్లిన 50 నుంచి 70 లారీల సరుకు ఇంకా అన్‌లోడ్ కాలేదని, దీంతో ధరలు పెరగడం లేదని పేర్కొన్నారు.



మార్కెట్‌కు చీనీ కాయలను తీసుకొస్తున్న దృశ్యం

గతంలో ఎన్నడూ లేని విధంగా..

సాధారణంగా మార్చి, ఏప్రిల్, మే నెలల్లో గరిష్ట ధరలు పలికేవి. కానీ, ఈసారి అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. ధరలు పెరగడం అటుంచి తగ్గుదల కనిపిస్తుండటంతో అన్నదాతలు దిక్కులు చూస్తున్నారు. ఏప్రిల్‌లో టన్ను రూ.40 వేలకు పైగా పలకాల్సివుండగా... గత రెండు నెలలుగా టన్ను రూ.20 వేల నుంచి రూ.25 వేలకు మించి పలకడం లేదు. అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డుకు ఇటీవల నిత్యం 1,000 నుంచి 1,500 టన్నుల సరుకు వస్తోంది. ఈ క్రమంలో శనివారం టన్ను గరిష్ట ధర రూ.20 వేల లోపే పలికింది. సరాసరి ధర రూ.13 వేలు మాత్రమే పలకడంతో రైతుల్లో ఆందోళన పెరుగుతోంది. దీనికి తోడు శనివారం మార్కెట్‌యార్డులో జీవాల సంత ఉండటంతో చీనీ అమ్మకాలకు తీవ్ర ఇబ్బంది ఎదురైంది. చాలా వాహనాల్లోని సరుకును కిందికి దించి అమ్మకాలు చేసేందుకు కూడా వీలు లేకుండా పోయింది. ఇలా రోజురోజుకు కష్టాలు ఎక్కువ అవుతుండటంతో చీనీ రైతులు భారీ నష్టాలు చవిచూస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి.

పరిస్థితి దారుణంగా ఉంది



గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి చీనీ రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. రంజాన్, ఉగాది, హోలీ పండుగలు అన్నీ వెళ్లినా... ధరలు మాత్రం పెరగడం లేదు. తోటల్లోనే టన్ను రూ.25 వేలకు మించి అడగడం లేదు. దానికి డబుల్ సూట్ ఇవ్వాల్సి ఉంటుంది. ఇప్పటికే నెల పాటు కాయలు కోయకుండా ధరల కోసం ఎదురుచూసినా ఫలితం కానరాలేదు. నాకు ఏడెకరాల చీనీ తోట ఉంది. దిగుబడి బాగానే ఉన్నా ధరలు చూస్తే ఏం చేయాలో అర్థం కావడం లేదు. టన్ను రూ.40 వేలు అటుఇటుగా పలికితే తప్ప గిట్టుబాటు కాదు. గతంలో కన్నా ఈ సారి చీడపీడల తాకిడి ఎక్కువ కావడంతో పురుగుల మందుల ఖర్చు బాగా పెరిగింది. – కుళ్లాయిరెడ్డి, చీనీ రైతు, కునుకుంట్ల గ్రామం, తాడిమర్రి మండలం

టీడీపీ నాయకుడి ఆత్మహత్యాయత్నం

- కుమారుడి ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగాన్ని తొలగించారని అఘాయిత్యం
- డబ్బు ముట్టజెప్పినా.. మరొకరితో మళ్లీ వసూలు చేసి అన్యాయం చేశారు: బాధిత కుటుంబీకుల ఆరోపణ



ఆత్మహత్యాయత్నం చేసిన ఎల్లప్ప

గుత్తి రూరల్: డబ్బు ముట్టజెప్పి కుమారుడికి ఇప్పించిన ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగాన్ని.. వేరొకరితో మళ్లీ వసూళ్లకు పాల్పడి తొలగించారని మనస్తాపం చెందిన ఓ టీడీపీ నాయకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన మండలంలోని మాముడూరు గ్రామంలో కలకలం రేపింది. బాధితుడి కుటుంబసభ్యులు తెలిపిన మేరకు..మామడూరుకు చెందిన బోలే ఎల్లప్ప టీడీపీలో చాలాకాలంగా చురుగ్గా పనిచేస్తున్నాడు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఎల్లప్ప కుమారుడు బోలే గిరిష్‌ని ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా నియమించారు. ఇందుకోసం గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు, అప్పటి గుత్తి పార్టీ ఇన్‌చార్జ్ గుమ్మనూరు నారాయణ రూ.4 లక్షలు తీసుకొన్నారు. ఇటీవల నారాయణ స్థానంలో గుత్తి ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు తీసుకున్న ఎమ్మెల్యే కుమారుడు గుమ్మనూరు ఈశ్వర్.. ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగం నుంచి బోలే గిరిష్‌ని తొలగించి అదే గ్రామానికి చెందిన మరొకరిని నియమించారు. ఇందుకు ఆయన రూ.8 లక్షలు తీసుకొన్నారు. తన కుమారుడిని ఉద్యోగం నుంచి తొలగించడాన్ని ఎల్లప్ప అవమానంగా భావించాడు. ఆదివారం తన భార్య లక్ష్మీదేవి, గ్రామంలోని సన్నిహితులు, ఇతర పార్టీ నాయకులకు ఫోన్ చేసి మాట్లాడిన అనంతరం గ్రామ శివారులోని చెట్టుకు ఉరి వేసుకొన్నాడు. ఈ క్రమంలోనే హుటాహుటిన అక్కడికి చేరుకున్న కుటుంబసభ్యులు, గ్రామస్తులు కొన ఊపిరితో ఉన్న ఎల్లప్పను కిందికి దించి వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

వక్ఫ్ యాక్ట్ వాపస్ లేలో..



వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ అనంతపురంలో నిర్వహించిన ర్యాలీలో భారీగా పాల్గొన్న ముస్లింలు



ర్యాలీలో పాల్గొన్న మేయర్ వసీం, వైఎస్సార్ సీపీ నేతలు రిజ్వాన్, రమేష్‌గౌడ్ తదితరులు

అనంతపురం కార్పొరేషన్: 'వక్ఫ్ యాక్ట్ వాపస్ లేలో.. హమ్ కిసీకో డర్తా నహీ (వక్ఫ్ చట్టాన్ని ఉపసంహరించుకోండి.. మేం దేనికీ భయపడేది లేదు)' అంటూ ముస్లింలు నినదించారు. అనంతపురం నగరంలో ఆదివారం యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీ విజయవంతమైంది. ర్యాలీలో వేలాదిగా ముస్లిం మైనార్టీలు పాల్గొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, ప్రజా, కుల సంఘాలు వీరికి మద్దతు తెలిపాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి క్లాక్‌టవర్, రఘువీరా కాంప్లెక్స్ మీదుగా సప్తగిరి సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మేయర్ వసీం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వక్ఫ్ చట్టం తీసుకొచ్చిందన్నారు. 11 ఏళ్లుగా ముస్లిం మైనార్టీలను బీజేపీ ఇబ్బంది పెడుతోందని, తమ పూర్వీకుల ఆస్తులను కాజేసేందుకు తాజాగా కుట్ర చేస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగజ్‌ఘర్ రిజ్వాన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వాన్ని నడుపుతోంది అదానీ, అంబానీలని, రానున్న రోజుల్లో 'వక్ఫ్' ఆస్తులను కార్పొరేట్ సంస్థలకు అప్పచెబుతారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగా వక్ఫ్ చట్టాన్ని తెచ్చారన్నారు. ఉర్దూ అకాడమీ రాష్ట్ర మాజీ చైర్మన్ నదీం అహ్మద్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ముస్లింలకు న్యాయం చేయాలని ఉంటే రంగనాథ్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప మాట్లాడుతూ 'వక్ఫ్' చట్టం ఉపసంహరించుకునే వరకు ముస్లింలకు అండగా ఉంటామన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జగదీష్ మాట్లాడుతూ ప్రధాని మోదీకి రాబోయే రోజుల్లో తప్పక బుద్ధి చెబుతామన్నారు. అనంతరం డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌గౌడ్, తబ్లిక్ జమాత్, సున్ని జమాత్ మతపెద్దలు, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర నాయకులు నియాజ్, వేమల నదీం, ఏకేఎస్ ఫయాజ్, ఖాజా, తనీష, పార్టీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్, ఎస్సీ ఎస్టీ ప్రజా సంఘాల నాయకులు సాకే హరి, ఇండ్ల ప్రభాకర్ రెడ్డి, నాయకులు తాజుద్దీన్, హారూన్ రషీద్, సూఫీ ఖాజా, జావెద్, జక్రియా, షమీ, అలీ, అల్లీపీరా, ఐఎంఎం బాషా, చామలూరు రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. చిక్కణ్ణేశ్వరుడి రథోత్సవం

కణేకల్లు మండల కేంద్రంలో ఆదివారం చిక్కణ్ణేశ్వర స్వామి రథోత్సవం కనుల పండువగా జరిగింది. రథోత్సవాన్ని చూసేందుకు తరలివచ్చిన భక్తులతో కణేకల్లులో సందడి నెలకొంది. 'చిక్కణ్ణేశ్వరా.. శరణు' అంటూ భక్తులు చేసిన ఘోషతో పురవీధులు మార్మోగాయి. స్వామి వారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించిన అనంతరం ఉత్సవ విగ్రహాన్ని రథంలో ఆశీనులు గావించి ఉత్సవం ప్రారంభించారు. రథోత్సవం సాగుతున్నంత సేపూ శివన్నామస్మరణ చేసుకుంటూ భక్తులు తన్మయత్వం చెందారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు. – కణేకల్లు:





అశేష భక్తజనం నడుమ సాగుతున్న చిక్కణ్ణేశ్వరస్వామి రథోత్సవం (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో స్వామివారు

కూలిన బతుకులు



ప్రమాద స్థలిలో చెల్లాచెదురుగా పడి ఉన్న మృతదేహాలు

వారంతా కూలీలు.. వ్యవసాయ, తదితర పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. రెక్కాడితే గానీ డొక్కాడని బతుకులు వారివి. వీలు కల్పించుకుని దైవదర్శనానికి వెళ్లారు. రాత్రి అక్కడే బస చేశారు. ఉదయాన్నే తిరిగి కూలి పనులకు వెళ్లాలని తెల్లవారుజామునే ఇంటికి బయల్దేరారు. కానీ రోడ్డు ప్రమాద రూపంలో వారిని మృత్యువు వెంటాడింది. ముగ్గురు మహిళా కూలీలను బలిగొంది.

- ఆటోను వేగంగా ఢీకొన్న ఐషర్ వాహనం
- ముగ్గురు మహిళా కూలీలు దుర్మరణం
- డ్రైవర్ సహా 11 మందికి గాయాలు

పరిగి: ఆటోను ఐషర్ వాహనం ఢీకొన్న ఘటనలో ముగ్గురు మహిళా కూలీలు మృతి చెందారు. వివరాల్లోకెళ్తే... రొద్దం మండలం దొడగట్ట గ్రామానికి చెందిన కూలీలు పిల్లలతో సహా 13 మంది శనివారం సాయంత్రం ఆటోలో హిందూపురం రూరల్ మండలం కొటిపిలోని చౌడమ్మ ఆలయానికి బయలుదేరారు. రాత్రికి కొటిపి చేరుకుని ఆలయంలో నిర్వహించిన భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. మొక్కులో భాగంగా అక్కడే నిద్ర చేశారు. మరుసటి రోజున కూలి పనులకు వెళ్లాల్సి ఉన్నందున ఆదివారం వేకువజామున చౌడమ్మ ఆలయం నుంచి ఆటోలో స్వగ్రామానికి బయల్దేరారు. కొడికొండ చెక్‌పోస్ట్ నుంచి కర్ణాటక ప్రాంతంలోని శిరాను కలుపుతూ నిర్మించిన నేషనల్ హైవే 544ఈపై ప్రయాణిస్తున్నారు.

దూసుకొచ్చిన మృత్యువు

తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో పరిగి మండలం ధనాపురం సమీపంలోకి రాగానే డ్రైవర్ బాబు నిద్ర మత్తు ఉందని గ్రహించి ముఖం కడుక్కోవాలనుకున్నాడు. రోడ్డు పక్కన ఆపి ముఖం కడుక్కున్న తర్వాత ఆటో గ్లాస్ శుభ్రం చేస్తుండగా హిందూపురం వైపు నుంచి వచ్చిన ఐచర్ వాహనం ఆటోను వెనకవైపు నుంచి వేగంగా ఢీకొట్టి ఆపకుండా వెళ్లిపోయింది. ఆటోలో ఉన్న వారందరూ ఎగిరి పడ్డారు. ఆటో సమీపంలోని కంపచెట్లలోకి దూసుకుపోయింది. క్షణాల్లో జరిగిన ఈ ప్రమాదంలో దొడగట్టకు చెందిన వెంకటరాముడు భార్య ఉప్పర అలివేలమ్మ (45), దాసన్న భార్య ఉప్పర సాకమ్మ (65), రామాంజినప్ప భార్య బోయ ఆదిలక్ష్మమ్మ (65) అనే ముగ్గురు కూలీలు అక్కడికక్కడే చనిపోయారు. మిగిలిన వారిలో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ముగ్గురితో పాటు డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో ఎస్ఐ రంగడుయాదవ్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను హుటాహుటిన అంబులెన్సుల్లో హిందూపురం ప్రభుత్వాసుపత్రికి చేర్చారు. పరిస్థితి విషమంగా ఉన్న అంజనరెడ్డి, ప్రమీలను బెంగళూరు ఆస్పత్రికి తరలించారు. హిందూపురం ఆస్పత్రిలో పాపన్న, విజయ్, డ్రైవర్ బాబు, అభినవ్, అనిల్‌కుమార్, అంజనమ్మ, రూప, యశ్వంత్‌రెడ్డి, సుజాత చికిత్స పొందుతున్నారు. ప్రయాణికుల్లో ప్రత్యక్ష సాక్షి యశ్వంత్‌కుమార్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



అలివేలమ్మ, వెంకటలక్ష్మమ్మ, సాకమ్మ (ఫైల్ ఫొటోలు)

ఐషర్ వాహనం గుర్తింపు

ధనాపురం సమీపంలో ఆటోను ఢీకొట్టి ఆపకుండా వెళ్లిపోయిన వాహనం కేఏ51ఏజీ 2498 నంబరు గల ఐషర్ వాహనంగా పరిగి పోలీసులు గుర్తించారు. ఫ్లిప్‌కార్ట్ వస్తువులతో వెళ్తున్న ఐషర్ వాహనం ఆటోను ఢీకొన్న తర్వాత అదే వేగంతో పావగడకు చేరుకుంది. అక్కడ అన్‌లోడ్ చేసి బెంగళూరుకు వెళ్లింది. పోలీసులు అక్కడికెళ్లి ఆ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ లక్ష్మీగౌడను అదుపులోకి తీసుకున్నారు.

రెప్పపాటులో ఘోరం..

ఉదయాన్నే కూలి పనులకు వెళ్లాలని చెప్పడంతో డ్రైవర్ బాబు నెమ్మదిగానే ఆటోను నడుపుతూ వస్తున్నాడని ప్రత్యక్ష సాక్షులైన కూలీలు తెలిపారు. అయితే నిద్రమత్తు ఉండటంతో ముఖం కడుక్కుని, అలాగే ఆటో గ్లాసును శుభ్రపరచుకుందామని డ్రైవర్ రోడ్డు పక్కన ఆపాడన్నారు. ఇంతలో వెనుకవైపు నుంచి వేగంగా వచ్చిన ఐషర్ వాహనం ఢీకొట్టిందని, కళ్లు తెరిచి చూసేలోపు అందరూ చెల్లాచెదురుగా పడి ఉన్నామని తెలిపారు.

సంక్షోభంలో రవాణా రంగం

ప్రజా జీవితంలో రవాణా రంగం కీలక భూమిక పోషిస్తోంది. ఎంతోమంది కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న ఈ రంగం ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి కారణంగా సంక్షోభంలో కూరుకుపోతోంది. దేశంలో మరే రాష్ట్రంలోనూ లేని విధంగా ఏపీలో పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెంచేశారు. రకరకాల పన్నుల పేరుతో అధిక మొత్తంలో నగదు వసూళ్లతో రవాణా రంగం కుదేలవుతోంది.

- పెరిగిన ఇంధనం, టైర్లు, విడి పరికరాల ధరలు
- కూలీలతో లోడింగ్, అన్‌లోడింగ్ కష్టాలు
- ఈఎంఐలు కట్టలేక రోడ్డు మీద పడే దుస్థితి
- రేపటి నుంచి కర్ణాటకకు నో ఎంట్రీ


హిందూపురం లారీ అసోసియేషన్ కార్యాలయం ఎదుట ఆపేసిన లారీలు

హిందూపురం అర్బన్: లారీ రవాణా రంగం ఒకప్పుడు ఓ వెలుగు వెలిగింది. రాష్ట్రంలో విజయవాడ తరువాత పదేళ్ల క్రితం వరకూ హిందూపురం రవాణా రంగంలో రెండో స్థానంలో ఉండేది. డీజిల్ ధరలు పెరగడం.. టోల్ గేట్ల మోత.. లోడింగ్– అన్‌లోడింగ్‌ల ఖర్చు, జీఎస్టీల భారంతో కనీస ఖర్చులు కూడా చేతికి అందడం లేదని లారీ యజమానులు వాపోతున్నారు.

ఉన్నవి నడపడమే గగనం

గతంలో ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 12వేలకు పైగా లారీలు ఉండేవి. ప్రధానంగా విజయవాడ, బెంగళూరు, నాగపూర్, కొలకత్తా, చెన్నై, కొచ్చికి ఇక్కడి నుంచి సరుకు ఎగుమతి, దిగుమతులు ఎక్కువగా జరిగేవి. దీంతో పదేళ్ల క్రితం వరకు లారీల నిర్వాహకులకు ఆదాయం బాగుండేది. ఈ క్రమంలో చాలా మంది ఫైనాన్స్ కింద లారీలు కొనుగోలు చేసి సరుకు రవాణా రంగంలో స్థిరపడ్డారు. కాలక్రమేణా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరుల కారణంగా సరుకు రవాణా వ్యవస్థ కుదేలవుతోంది. కొత్తగా లారీలు కొనుగోలు చేసేవారి సంగతి పక్కన ఉంచితే... ఉన్నవాటిని నడపడమే గగనంగా మారుతోంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4 వేల వరకు లారీలు ఉన్నాయి.

కాలం మారినా అవే బాడుగలు

రవాణా రంగంలో నెలకొన్న తీవ్ర పోటీ కారణంగా ఐదారేళ్ల క్రితం ఉన్న కిరాయినే ఇప్పటికీ ఉంది. లోడింగ్‌లు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. సీజన్‌లో కాస్త మెరుగనిపించినా ఆ తర్వాత లారీలన్నీ ట్రాన్స్‌పోర్టు కార్యాలయం ఎదుటే ఉంటున్నాయి. సరుకు రవాణాకు ఇప్పుడు రైళ్లను ఎక్కువగా ఎంచుకోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది.

పెరిగిన ఇన్సూరెన్స్, పన్నులు

లారీ విలువను బట్టి రెండేళ్ల క్రితం థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ కింద రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు బీమా ప్రీమియంను యజమానులు చెల్లించేవారు. ఇప్పుడు ఇదే ప్రీమియం రూ.40 వేల నుంచి రూ.75 వేల వరకు చేరింది. 22 చక్రాల కొత్త లారీకి ఇన్సూరెన్స్ కింద రూ.1.25 లక్షల ప్రీమియం చెల్లించాల్సి వస్తోంది. అలాగే లారీని బట్టి మూడు నెలలకు ఒకసారి స్టేట్ పర్మిట్ కింద పన్ను రూ.8 వేల నుంచి 13 వేల వరకు చెల్లించాలి. నేషనల్ పర్మిట్ అయితే మరింత ఎక్కువవుతుంది. ఇక ఏడేళ్లు దాటిన లారీలకు పన్నులకు అదనంగా గ్రీన్ ట్యాక్స్ తప్పక చెల్లించాల్సి వస్తోంది.

పెరిగిన విడిభాగాల ధరలు

ఇంజన్ ఆయిల్‌తో పాటు లారీల విడిభాగాల ధరలు దాదాపు 22 శాతం మేర పెంచారు. దీంతో లారీ సామర్థ్యాన్ని బట్టి నెలవారీ నిర్వహణ ఖర్చు రూ.20వేల నుంచి రూ.25 వేల వరకు వస్తోంది. టైర్ల ధరలు మూడేళ్ల క్రితం రూ.16,500 ఉంటే ఇప్పుడు అవే టైర్లు రూ.21,500కు చేరుకున్నాయి. రేడియల్ టైర్లయితే రూ.26వేలు ఖర్చవుతోంది. రోడ్డుపై లారీ తీసిన ప్రతిసారీ పోలీస్, రవాణా అధికారులకు ఎంతో కొంత ముట్టజెప్పాల్సి వస్తోంది.

మోయలేని ఆర్థిక భారం

రవాణా రంగంపై రాష్ట్ర ప్రభుత్వం విధిస్తున్న నాలుగు శాతం వ్యాట్ తగ్గించాలి. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్రంలోనే దీని ధర ఎక్కువ. విడి భాగాల ధరలు సైతం అందుబాటులో లేవు. అంతేకాక కొందరిని నమ్మి లారీలు అప్పజెప్పే కాలమూ పోయింది. ఓనర్లే తిప్పడమో లేదా డ్రైవర్‌తో పాటు వెళ్లడం చేస్తున్నారు. జీఎస్టీతో యజమానులపై మోయలేని ఆర్థిక భారం పడుతోంది. వీటిని తగ్గిస్తే ఎంతో వెసులుబాటుగా ఉంటుంది.

– షేక్ ఇందాద్, హిందూపురం లారీ అసోసియేషన్ అధ్యక్షుడు

గ్రీన్ ట్యాక్స్ పేరుతో బాదుడు



10 ఏళ్ల క్రితం లీటర్ డీజిల్ ధర రూ.68 ఉండేది. అప్పట్లో విజయవాడకు టన్ను సరుకు రవాణాకు రూ.1,600 ఇచ్చేవారు. అంటే లారీకి 15 టన్నులు వేసినా రూ.24 వేలు వచ్చేది. రానూపోను రూ.48 వేలు దక్కితే ఖర్చులు పోను రూ.15వేలు మిగిలేది. ఇప్పుడు లీటరు డీజిల్ రూ.100కు చేరువలో ఉంది. విజయవాడకు కిరాయి టన్నుకు రూ.14 వేలు ఇస్తున్నారు. ఈ లెక్కన రానూపోను రూ.42 వేలు వస్తుంది. ఖర్చులన్నీ పోనూ యజమానికి మిగిలిదే ఏదీ ఉండదు. దీనికి తోడు గ్రీన్‌ట్యాక్స్‌ను అమాంతం పెంచేశారు.

– షౌకత్ అలీఖాన్, లారీ ఓనర్, హిందూపురం

15 నుంచి కర్ణాటకకు లారీల బంద్

రవాణా రంగాన్ని కలవర పెడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్యలకు నిరసనగా ఈ నెల 14న అర్ధరాత్రి నుంచి రవాణా కార్యకలాపాలు విరమించాలని ఫెడరేషన్ ఆఫ్ కర్ణాటక స్టేట్ లారీ ఓనర్స్, ఏజెంట్స్ అసోషియేషన్ నిర్ణయించింది. ఇందుకు ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్ మద్దతు తెలిపింది. లీటర్ డీజిల్‌పై రూ. 5 అదనంగా పెంచడం, టోల్‌గేట్ల వద్ద బలవంతపు వసూళ్లు, బెంగళూరులో అశాస్త్రీయమైన నో ఎంట్రీ నిబంధనలు, అప్పు కింద కొనుగోలు చేసిన లారీ యజమానులపై ఫైనాన్స్ వారి వేధింపులు.. తదితరాలను నిరసిస్తూ కర్ణాటక లారీ అసోసియేషన్ ఈ మేరకు ఉద్యమానికి పిలుపునిచ్చింది. దీంతో ఈ నెల 15 నుంచి కర్ణాటకకు లారీల రాకపోకలు నిలిపివేయనున్నారు.

క్లుప్తంగా

నెట్టికంటుడికి కిలో వెండి వితరణ


దాతల నుంచి వెండిని స్వీకరిస్తున్న ఆలయ సూపరింటెండెంట్ వెంకటేశులు

గుంతకల్లు రూరల్: శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన మౌనిక, రాకేష్ దంపతులు ఆదివారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి కిలో బరువున్న వెండిని అందజేశారు. అంతకు ముందు దాతల కుటుంబసభ్యుల పేరున ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

లైంగిక వేధింపులపై కేసు నమోదు

గార్లదిన్నె: మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళను లైంగికంగా వేధిస్తున్న పి.కొత్తపల్లి గ్రామానికి చెందిన యువకుడు భాస్కర్‌పై కేసు నమోదు చేసినట్లు గార్లదిన్నె పీఎస్ ఎస్‌ఐ గౌస్ మహమ్మద్‌బాషా తెలిపారు. భాస్కర్ యర్రగుంట్ల గ్రామంలో కిరాణా దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఓ మహిళను లైంగిక వేధింపులకు గురి చేస్తూ వచ్చాడు. కుటుంబ సభ్యులతో కలసి బాధిత మహిళ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బ్రెయిన్‌స్ట్రోక్‌తో ఉపాధ్యాయుడి మృతి


కాంతారావు (ఫైల్)

గుత్తి రూరల్: మండలంలోని బాచుపల్లి జంగాల కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ఎస్.కాంతారావు (58) ఆదివారం కన్నుమూశారు. మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన ఆయన కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుండే వారు. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స కోసం కుటుంబసభ్యులు చేర్పించారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం ఉదయం 6.30 గంటలకు బ్రెయిన్ స్ట్రోక్‌తో ఆయన మృతి చెందారు. ఆయన మృతిపై వైఎస్సార్‌టీఏ జిల్లా కార్యదర్శి శ్రీధర్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓబులేసు, వెంకటరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.

ఘనంగా కదిరప్పస్వామి రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

గుంతకల్లు రూరల్: మండలంలోని నాగసముద్రం గ్రామంలో వెలసిన కదిరప్పస్వామి రథోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేడుకలను తిలకించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. వేకువజామునే ఆలయంలో శ్రీలక్ష్మీనరసింహ మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై కొలువుదీర్చి కల్యాణం జరిపించారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తీసుకెళ్లి రథంపై అధిష్ఠింపజేసి ప్రత్యేక పూజల అనంతరం గోవింద నామస్మరణతో భక్తులు ముందుకు లాగారు.

జీఓ 77ను రద్దు చేయాలి : పీడీఎస్‌యూ


మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్

అనంతపురం ఎడ్యుకేషన్: ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి పీజీ విద్యార్థులను దూరం చేసే జీఓ 77ను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు కె.భాస్కర్ డిమాండ్ చేశారు. ఆదివారం అనంతపురంలోని జార్జిరెడ్డి కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కె.భాస్కర్‌తో పాటు పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేంద్ర ప్రసాద్ మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.3,600 కోట్ల మేర ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోయాయన్నారు. ఫీజు బకాయిలు విడుదల చేస్తామన్న విద్యాశాఖ మంత్రి లోకేష్ మాటలు ప్రకటనలకే పరిమితమయ్యాయని మండిపడ్డారు. యువగళం పాదయాత్రలో జీఓ 77 రద్దు చేస్తామంటూ ఇచ్చిన హామీని మంత్రి నారా లోకేష్ నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు గడిచినా ఇంతవరకూ ఇచ్చిన హామీలు అమలు చేయలేదని, విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయకుండా పాలకులు కాలయాపన చేస్తున్నారన్నారు. వీసీ నియామకాలపై యూజీసీ నూతన ప్రతిపాదనలను వ్యతిరేకించి, యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని కాపాడాలన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలని, జీఓలు 107, 108ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తల్లికి వందనం పథకాన్ని తక్షణమే అమలు చేయాలన్నారు. సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల ప్రసాద్, కోశాధికారి బండారి శంకర్, నాయకులు తేజ, ఉదయ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమణ పాల్గొన్నారు.

ఏడుగురిపై కేసు నమోదు

తాడిపత్రి టౌన్: ఈ నెల 11న తాడిపత్రి పట్టణ పోలీస్‌స్టేషన్ ఎదుట బంగారం వర్తకుడు గౌసుల్లా ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సాయిప్రసాద్ ఆదివారం తెలిపారు. నిందితుల్లో తాడిపత్రికి చెందిన జిలాన్, రఫీ, హాజీ, రసీద్, గౌస్, ఇంతియాజ్, రబ్బానీ ఉన్నారని పేర్కొన్నారు.

రాజకీయ ఒత్తిళ్లతో జేఎల్‌ఎంపై వేటు

- అందరి కంటే ముందుగా టీడీపీ నేతకు పింఛన్ ఇవ్వలేదని అక్కసు

ఆత్మకూరు: గ్రామంలో అందరికంటే ముందుగా తనకు పింఛన్ ఇవ్వలేదన్న అక్కసుతో టీడీపీ నేత సాగించిన పైరవీలకు ఓ ప్రభుత్వ ఉద్యోగి బలయ్యాడు. వివరాలు.. విద్యుత్ శాఖలో జేఎల్‌ఎం – గ్రేడ్ 2 ఉద్యోగిగా ఆత్మకూరు మండలం వడ్డుపల్లి గ్రామంలో మధు పనిచేస్తున్నారు. గత ఐదేళ్లుగా అయన అక్కడే పనిచేస్తుండడంతో గ్రామస్తుల కుటుంబసభ్యుల్లో ఒక్కడిలా మారిపోయారు. విద్యుత్ సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామ వలంటీర్ల ద్వారా సామాజిక పింఛన్ల పంపిణీ జరిగేది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వలంటీర్ వ్యవస్థను రద్దు చేయడంతో పింఛన్లను గ్రామ సచివాలయ ఉద్యోగులతో పాటు ఇతర ప్రభుత్వ శాఖల ఉద్యోగులూ పంపిణీ చేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో వడ్డుపల్లిలోని మొత్తం పింఛన్లలో 58 లబ్ధిదారుల పంపిణీ బాధ్యతను మధుకు ఉన్నతాధికారులు అప్పగించారు. పింఛన్‌ను అందరికంటే తనకు ముందుగా ఇవ్వలేదనే అక్కసుతో మధుతో స్థానిక టీడీపీ నేత తీవ్ర స్థాయిలో గొడవ పడ్డాడు. ఆ సమయంలో మధు ఎంత నచ్చచెప్పినా వినకుండా జనవరి 10న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశాడు. ఆయన పనితీరు బాగాలేదని, ఆయనను అక్కడి నుంచి బదిలీ చేయాలని కోరాడు. దీంతో మూడు రోజుల క్రితం మధుకు ఓ వ్యక్తి ఫోన్ చేసి అనంతపురానికి బదిలీ అయినట్లు తెలిపాడు. అయితే ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు తనకు అందలేదని మధు తెలిపారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు విద్యుత్ శాఖ ఎస్‌ఈని నేరుగా కలసి మధు బదిలీపై నిలదీశారు. ఆయన బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తున్నారని, కేవలం పింఛన్ ముందుగా టీడీపీ నేతకు ఇవ్వనంత మాత్రానా ఓ ఉద్యోగిని బదిలీ చేస్తారా? అంటూ మండి పడ్డారు.

తీర్థయాత్రలో విషాదం


ప్రమాదానికి గురైన కారు


మృతురాలు శారద, తీవ్రంగా గాయపడిన వెంకటరమణ, కీర్తన

- మహిళా ఉపాధ్యాయురాలు మృతి
- భర్త, కుమార్తె పరిస్థితి విషమం

పుంగనూరు: నూతనంగా కొనుగోలు చేసిన కారులో తీర్థయాత్రకు వెళ్లి వస్తున్న ఉపాధ్యాయ దంపతులు ప్రమాదానికి గురయ్యారు. భార్య అక్కడికక్కడే మృతి చెందగా... విషమ పరిస్థితుల్లో భర్త, కుమార్తె ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వివరాలు... అన్నమయ్య జిల్లా కలకడ మండలం ఎర్రయ్యగారిపల్లికి చెందిన వెంకటరమణ, శారద (45) దంపతులకు కుమార్తె కీర్తన, కుమారుడు శ్రీకర్ ఉన్నారు. శ్రీసత్యసాయి జిల్లా కదిరిలో నివాసముంటూ అదే మండలం బాలప్పగారిపల్లిలో ఉపాధ్యాయురాలిగా శారద, అన్నమయ్య జిల్లా సోంపల్లిలో స్కూల్ అసిస్టెంట్‌గా వెంకట రమణ పనిచేస్తున్నారు. కీర్తన ఇటీవల ఇంటర్ పరీక్షలు రాసింది. శ్రీకర్ గుడివాడలోని ఓ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్నాడు. ఇటీవల ఉపాధ్యాయ దంపతులు నూతనంగా ఓ కారును కొనుగోలు చేశారు. తమిళనాడులోని తిరువణ్ణామలైకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఈ లోపు శనివారం ఇంటర్ ఫలితాలు వెల్లడయ్యాయి. కుమార్తె కీర్తన అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించడంతో ఎంతో సంతోషపడిన ఉపాధ్యాయ దంపతులు తిరువణ్ణామలైకు వెళ్లి పూజాదికాలు ముగించుకుని ఆదివారం తిరుగు ప్రయాణమయ్యారు. మార్గ మధ్యంలో పుంగనూరు మండలం సుగాలీమిట్ట వద్దకు చేరుకోగానే ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన ఐచర్ వాహనం ఢీకొంది. ఘటనలో కారు నుజ్జునుజ్జయింది. శారద అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన వెంకటరమణ, కుమార్తె కీర్తనను స్థానికులు గమనించి మదనపల్లిలోని ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ఇద్దరినీ మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, శారద అంత్యక్రియలను వెంకటరమణ స్వగ్రామం కలకడలో నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు.

విద్యా విధానంలో.. గందరగోళ నిర్ణయాలు తగదు

- రాష్ట్రోపాధ్యాయ సంఘం



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు నీలూరి రమణారెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్రంలోని విద్యా విధానంలో రోజురోజుకూ గందరగోళ నిర్ణయాలు తీసుకుంటున్నారని, ఇలాంటి నిర్ణయాలు సముచితం కాదని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నాయకులు మండిపడ్డారు. ఆదివారం విజయవాడ వేదికగా జరిగిన ఎస్టీయూ రాష్ట్ర కార్య వర్గ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు నీలూరి రమణారెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో అమలు కాబోతున్న విద్యా విధానంలో ఉపాధ్యాయులకు అన్యాయం జరిగేలా అధికారిక నిర్ణయాలు ఉంటాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే 117 జీఓను రద్దు చేస్తామని, ప్రతి పంచాయతీకి ఓ మోడల్ పాఠశాల ఏర్పాటు చేస్తామని చెప్పారన్నారు. మరోసారి విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న కారణంగా ప్రతి పంచాయతీకి మోడల్ పాఠశాల ఏర్పాటు చేయలేమని, ఆ గ్రామంలో ఉన్న ఉన్నత పాఠశాలలో 1 నుంచి 10వ తరగతి వరకు ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేస్తామని ప్రకటించడం చాలా దుర్మార్గమన్నారు. ఈ విధానాలతో ఉపాధ్యాయుల మీద ఒత్తిళ్లు పెరిగిపోతాయన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచించి జీఓ 117ను రద్దు చేసి విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ప్రతి పంచాయతీకి ఒక మోడల్ పాఠశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బడుగు, బలహీన వర్గాల పిల్లలకు ప్రాథమిక పాఠశాలలు అందుబాటులో ఉంచి విద్యారంగాన్ని బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. రామాంజనేయులు, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి జి. సూర్యుడు, రాష్ట్ర కార్యదర్శి కె. చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్య

పెద్దవడుగూరు: అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పెద్దవడుగూరు మండలం చింతలచెరువు గ్రామానికి చెందిన బోయ రామాంజనేయులు (49)కు భార్య రమాదేవి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తమకున్న ఐదు ఎకరాల్లో పత్తి పంట సాగు చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవారు. ఈ క్రమంలో పంట పెట్టుబడులు, కుమార్తెల పెళ్లిళ్లు, అనారోగ్యంతో బాధపడుతున్న భార్య చికిత్సకు తెలిసిన వారి వద్ద రూ.5 లక్షల వరకు అప్పులు చేశాడు. గ్రామంలో వ్యవసాయ పనులు సక్రమంగా లేకపోవడంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపానికి గురైన ఆయన శనివారం రాత్రి పురుగుల మందు తాగాడు. అపస్మారకంగా పడి ఉన్న ఆయనను గమనించిన కుటుంబసభ్యులు వెంటనే అనంతపురంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు.

సాగర్ సిమెంట్ కర్మాగారంలో కార్మికుడి మృతి


సూర్యుడు (ఫైల్)

యాడికి: మండలంలోని గుడిపాడు గ్రామ సమీపంలో ఉన్న సాగర్ సిమెంట్ కర్మాగారంలో ఆదివారం సాయంత్రం ఓ కార్మికుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు... గుడిపాడుకు చెందిన సూర్యుడు(43)కు భార్య శివమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. గత పదేళ్లుగా సాగర్ సిమెంటు కర్మాగారంలో కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం సాయంత్రం విధులకు వెళ్లిన ఆయన ఉన్నఫళంగా కుప్పకూలాడు. గమనించిన యాజమాన్యం వెంటనే తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించింది. పరీక్షించిన వైద్యులు అప్పటికే సూర్యుడు మృతిచెందినట్లు నిర్ధారించారు.

అ'పూర్వ' సమ్మేళనం


నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

పెద్దవడుగూరు: స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో 1992లో పదో తరగతి చదివిన వారు ఆదివారం అదే పాఠశాల వేదికగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలోని సరస్వతీ దేవి విగ్రహం వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం స్థానికంగా ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఆప్యాయంగా ఒకరినొకరు పలకరించుకున్నారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి ఆశీర్వాదం తీసుకున్నారు. ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం పాఠశాలకు చేరుకుని తమతో పాటు చదువుకుని అకాల మృత్యువాత పడిన వారి కుటుంబాలకు ఆర్థిక సాయాన్ని అందజేశారు. రూ.40 వేలతో పాఠశాలలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు పూర్వ విద్యార్థులు అనిల్, రాజేశ్వరమ్మ ముందుకు వచ్చారు.

48 ఏళ్ల తర్వాత...


అనంతపురంలోని శ్రీపొట్టి శ్రీరాములు నగర పాలకోన్నత పాఠశాలలో నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని శ్రీపొట్టి శ్రీరాములు నగర పాలకోన్నత పాఠశాలలో 1976–1977లో 10వ తరగతి చదివిన వారు ఆదివారం అదే పాఠశాల వేదికగా కలుసుకున్నారు. ఎక్కడెక్కడో ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుంటూ జీవితంలో స్థిరపడిన వారు 48 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. చాలామంది విద్య, వైద్యం, న్యాయ శాఖ, రెవెన్యూ, ఆడిట్, అటవీ శాఖ, పోస్టల్, బీఎస్ఎన్ఎల్ తదితర రంగాల్లో సేవలందించి ఉద్యోగ విరమణ సైతం పొందారు. తమ చిన్ననాటి అల్లర్లను, గురువులతో వారికున్న సత్సంబంధాలను గుర్తు చేసుకున్నారు. గురువులు సూర్యనారాయణ శాస్త్రి, రంగప్ప, కృష్ణమూర్తి, గంగాచారిని ఘనంగా సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి శ్యామసుందర్, అటవీ శాఖ అధికారి ఆంజనేయులు, వైద్య ఆరోగ్య శాఖ పర్యవేక్షకులు మనోహర్, పోస్టల్ శాఖ వన్నప్ప, ఆడిటర్ హరినాథ్, విశ్రాంత తహసీల్దార్ సిరాజుద్దీన్, విద్యా శాఖ షేక్ మహబూబ్‌బాషా, రియాజుద్దీన్, రక్షణ శాఖ లక్ష్మీకాంత రెడ్డి, వ్యాపారవేత్త అబ్దుల్ ఖయూమ్‌తో పాటు మరో 50 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం గురువులు పుల్లన్న, పద్మనాభ శాస్త్రి, చిన్నకేశవులు ఇళ్ల వద్దకు వెళ్లి ఘనంగా సత్కరించారు.

క్లుప్తంగా

ఘనంగా శ్రీరామ పట్టాభిషేకం



పట్టాభిషేక ఉత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

అనంతపురం కల్చరల్: శ్రీరామ నవమి ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన శ్రీరామ పట్టాభిషేక వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. వేదపండితుడు కరణం హర్షశర్మ పట్టాభిషేక ఉత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. తొలుత సీతారాములకు అభిషేక, అలంకార సేవలు నిర్వహించారు. ఆలయం శ్రీరామ నామస్మరణతో మార్మోగింది. ప్రధాన అర్చకులు శ్రీరామ పట్టాభిషేక ఘట్టాలను వివరించారు. సాయంత్రం సర్వాంగ సుందరంగా అలంకార భూషితుడైన కోదండ రాముడు నగరవీధుల్లో గజవాహనంపై ఊరేగి భక్తులకు దర్శనమిచ్చాడు. స్వామివారి పల్లకీ సేవ సాగుతున్నప్పుడు భక్తులు ఎదురొచ్చి హారతులు పట్టారు. కళాకారులు భజనలతో స్వామికి నీరాజనాలర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ, అర్చక బృందాలు, భక్త మండలి సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ, క్విజ్ పోటీలు



సర్టిఫికెట్లను చూపుతున్న విద్యార్థులు

అనంతపురం కల్చరల్: అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం నెహ్రూ యువకేంద్రం విద్యార్థులకు క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఎన్‌వైకే ఇన్‌చార్జి గోవర్ధన శ్రీనివాసుల నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రాజ్యాంగ నిర్మాతగా, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా వెలుగొందుతున్న బాబా సాహెబ్ అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. రాజ్యాంగ పీఠికను చదివి వినిపించారు. అలాగే తెలంగాణ రాష్ట్రం నుంచి జాతీయ యువజన అవార్డు అందుకున్న శివకుమార్‌ను సత్కరించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన యువతీ యువకులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు బిసాతి భరత్, జీవన్‌కుమార్, జయమారుతి, ప్రగతి పథం పవన్, గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి వివాహ పరిచయ వేదికకు స్పందన



మాట్లాడుతున్న రాయలసీమ రెడ్డి జన సంఘం వ్యవస్థాపకుడు రొద్దం సురేష్‌రెడ్డి

రాప్తాడురూరల్: రాయలసీమ రెడ్డి జన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రెడ్డి ఉచిత వివాహ పరిచయ వేదికకు మంచి స్పందన లభించింది. అనంతపురం రూరల్ పాపంపేటలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన వేదికకు అనంతపురం జిల్లాతో పాటు తిరుపతి, ప్రొద్దుటూరు, నందికొట్కూరు, నంద్యాల, కర్నూలు, మడకశిర, హిందూపురం, ధర్మవరం ప్రాంతాల నుంచి యువతీ యువకుల తల్లిదండ్రులు హాజరై బయోడేటాలను పరిశీలించారు. రోజూ ఆఫీసులో సాయంత్రం 5 నుంచి 6:30 గంటల వరకు అందుబాటులో ఉంటామని రాయలసీమ రెడ్డి జన సంఘం వ్యవస్థాపకుడు రొద్దం సురేష్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు చంద్రమౌళి రెడ్డి, కార్యదర్శి దుబ్బ కిషోర్ రెడ్డి, ట్రెజరర్ తోపుదుర్తి రామకృష్ణా రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ మంత్రి విశ్వనాథ్ రెడ్డి, కోన వెంకట శివారెడ్డి, దయానంద రెడ్డి, పోతిరెడ్డి, కమలాపురం చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

పరామర్శ



పెద్దన్నకు ధైర్యం చెబుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: అనారోగ్యంతో బాధపడుతున్న బి.యాలేరు ఎంపీటీసీ వరలక్ష్మి భర్త, వైఎస్సార్ సీపీ నాయకుడు పెద్దన్నను ఆదివారం మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పరామర్శించారు. ఆదివారం మదిగుబ్బ గ్రామానికి చేరుకుని ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఈ విషయాన్ని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి తెలియజేయగా.. పెద్దన్నతో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. అధైర్యపడకు.. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ సుబ్బర హేమలత, సర్పంచులు నరసింహ, లక్ష్మీనారాయణ రెడ్డి, ఓబులేసు, తలుపూరు ఎంపీటీసీ ఓబులేష్, నాయకులు భాస్కర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాపాడితేనే రాబడి



జాగ్రత్తలు ఇలా..

- పశువులను ఉదయం, సాయంత్రం మాత్రమే మేతకు తీసుకెళ్లాలి.
- రోజుకు రెండు మూడు సార్లు పశులను చల్లని నీటితో కడగాలి.
- పశుగ్రాసం ఉన్న పాకల్లో ఉంచుతూ చుట్టూ నీడనిచ్చే చెట్లను పెంచాలి.
- ఉష్ణోగ్రతలను అదుపు చేసేందుకు వీలుగా పాకల చుట్టూ తడిపిన గోనె సంచులను కట్టాలి.
- పాకలు లేని చోట చెట్ల కింద సేద తీర్చాలి.
- తర్వాత వీలైనంత వరకు పచ్చిగడ్డి అందించాలి.
- పశువులు రోజుకు 60 నుంచి 70 లీటర్ల నీళ్లు తాగుతాయి. నీటిని నిరంతరం అందుబాటులో ఉంచాలి.
- అధిక ఉష్ణోగ్రతకు గురయ్యే పశువుల తల, శరీర భాగాలను నీటితో తడపాలి. ఉష్ణతాపానికి గురయ్యే బర్రెల ద్వారా 20 శాతం పాల దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉంది.



- పశువులకూ వేసవి గండం
- ప్రమాద స్థితిలో ఉష్ణోగ్రతలు
- పాల దిగుబడిపై ప్రభావం
- జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్న పశువైద్యులు

రాప్తాడు: మండలంలో వ్యవసాయం తర్వాత పాడి పరిశ్రమకే రైతులు అధిక ప్రాధాన్యత ఇస్తారు. పెరుగుతున్న ఎండల తీవ్రత నేపథ్యంలో పాడి రైతులు తగు జాగ్రత్తలు పాటిస్తేనే అధిక దిగుబడులు సాధించవచ్చు. వేసవిలో రోజు రోజుకూ ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ఎండల తీవ్రతకు పశువులు అల్లాడిపోతున్నాయి. ఉష్ణోగ్రతలు 40 నుంచి 45 డిగ్రీల సెల్సియస్ వరకూ పెరుగుతుండటంతో పాల దిగుబడి గణనీయంగా తగ్గిపోతుంది. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి 9 నెలలు పూర్తి కావస్తున్నా.. పాడి రైతులకు పశుగ్రాసం, దాణా అందించడంలో పూర్తిగా విఫలమైందని రైతులు ఆరోపిస్తున్నారు. మండల వ్యాప్తంగా ఆవులు, బర్రెలు 15 వేల దాకా ఉన్నాయి. వీటితో పాటు గొర్రెలు, మేకలు 1.60 లక్షలు, గేదెలు 6,500, పాడి ఆవులు 8,500 వరకూ ఉన్నాయి. వేసవి తీవ్రత ఆవుల కంటే బర్రెలపై అధికంగా ఉంటుంది. వేసవి కాలం ముగిసే వరకు పశువులను జాగ్రత్తగా కాపాడుకోవాలని ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకుడు ప్రకాష్ సూచిస్తున్నారు.

వడదెబ్బ లక్షణాలు

వడదెబ్బ తగిలిన పశువుల్లో శరీర ఉష్ణోగ్రత 103 డిగ్రీల కంటే ఎక్కువగా పెరుగుతుంది. చర్మం గట్టి పడుతుంది. చెమటలు ఎక్కువగా బయటకు రావడం, దాహం అధికంగా పెరగడం, మేత సరిగ్గా మేయక పోవడం, శ్వాస కష్టంగా మారుతుంది. ఎదకు సరిగా రాకపోవడం, గర్భస్రావం వంటి సమస్యలు తలెత్తుతాయి. పశువులు క్రమంగా అపస్మారక స్థితిలోకి వెళ్లి మరణిస్తాయి.

చికిత్స

వడదెబ్బకు గురైన పశువులను గుర్తించి వెంటనే చికిత్స చేయించాలి. చల్లటి ప్రదేశాల్లో ఉంచి తేలికగా జీర్ణమయ్యే దాణా, గంజిలో ఉప్పు కలిపి ఆహారంగా ఇవ్వాలి. వైద్యులను సంప్రదించి డెక్ట్రోజ్ సైలైన్ ద్రావణాన్ని రక్తనాళంలోకి విటమిన్ ఏ, డీ సూదిమందులు వేయించాలి. రోజుకు 40 లీటర్ల నీటిని తాగించాలి.

పచ్చిమేతే రక్షణ

వేసవిలో పశువులకు పచ్చిమేత అందించాలి. పచ్చిగడ్డి పశువుల శరీర ఉష్ణోగ్రతను తగ్గిస్తుంది. పోషక విలువల కోసం ఖనిజ లవణ మిశ్రమం (మినరల్ మిక్సర్) వంటివి వాడాలి. పచ్చి గడ్డి సదుపాయం లేని రైతులు పాతర వేసిన యూరియా గడ్డిని అందిస్తే ఫలితం ఉంటుంది. ఇందులో 45–55 శాతం వరకూ తేమ ఉంటుంది. శరీర ఉష్ణోగ్రత తగ్గి పాల దిగుబడి పెరిగే అవకాశం ఉంది. పశువుల పాక వద్ద పేడ, పెంట కుప్పల మీద వాలే దోమలు, ఈగల నివారణకు క్రిమిసంహారక మందులు పిచికారీ చేయాలి.

పరిసరాల శుభ్రత ముఖ్యం

- పశువులకు కొట్టం ఏర్పాటు చేసుకోవాలి. పరిసరాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. కొట్టంలో గాలి, వెలుతురు బాగా ప్రవేశించేలా ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉంది.
- పరిశుభ్రమైన చల్లని నీరు పశువులకు అందుబాటులో ఉంచితే మేలు. పచ్చని గడ్డి, ఎండు గడ్డి సమృద్ధిగా అందించాలి.
- సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. అంటు వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యాధులకు కారణమయ్యే గోమార్లు, దోమలు, ఈగలను నిర్మూలించాలి.
- గేదెల పాకలు చల్లగా ఉండేలా చూసుకోవాలి. పశువుల పాక పైకప్పును గడ్డితో కప్పి నీరు చల్లుతూ ఉండాలి. వీలైనంత వరకూ పాక పరిసరాల్లో చట్టని నీడనిచ్చే కానుగ, వేపచెట్టు పెంచుకోవాలి.

సంపాదన మేతకే సరిపోతుంది



పాడి ఆవుల ద్వారా వచ్చే సంపాదన కాస్త మేతకే సరిపోతోంది. నాకు ఐదు పాడి ఆవులు ఉన్నాయి. వాటికి రోజుకు రూ.500 వరకు మేతకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం 90 శాతం సబ్సిడీతో వరి గడ్డితో పాటు మొక్క జొన్న కర్రలు, దాణా అందజేయాలి. వేసవి కాలం కావడంతో పాల దిగుబడి కూడా తగ్గిపోయింది.

– చిరుతల పురుషోత్తం, పాడి రైతు, రాప్తాడు

ఎండల్లో పశువులను మేపవద్దు



ఎండల్లో పాడి పశువులను మేపకపోవడం చాలా మంచిది. సాధ్యమైనంత వరకూ నీడలో ఉంచాలి. గ్రామాల్లో పశువులకు తాగునీటి తొట్టెలను ఏర్పాటు చేసుకోవాలి. తొట్టెల ఏర్పాటుకు ఆయా గ్రామాల రైతులు అధికారులను సంప్రదించవచ్చు. ఉపాధిహామీ పథకం ద్వారా తొట్టెలను నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపిస్తాం.

– ప్రకాష్, ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకుడు, రాప్తాడు

బీపీ మండల్ ఆశయ సాధనకు కృషి



నినాదాలు చేస్తున్న ఆర్‌ఈఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్/అనంతపురం టవర్‌క్లాక్: బీసీ రిజర్వేషన్ల పితామహుడు బీపీ మండల్ అని రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఆర్‌ఈఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నారాయణ నాయక్ పేర్కొన్నారు. ఆర్‌ఈఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఉపాధ్యాయ భవనంలో 'బీపీ మండల్' వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ నాయక్ మాట్లాడుతూ.. బీపీ మండల్ 1952లో బీహార్ అసెంబ్లీకి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారన్నారు. బీహార్‌లో బలహీనవర్గాల కార్మికులపై రాజపుత్రులు దాడి చేయడాన్ని తీవ్రస్థాయిలో ఖండించారని గుర్తు చేశారు. 1978 డిసెంబర్‌లో ప్రధానమంత్రి మొరార్జీ దేశాయ్ ఐదుగురు సభ్యుల కమిషన్‌కు చైర్మన్‌గా మండల్ వ్యవహరించారన్నారు. కమిషన్ నివేదిక 1980 డిసెంబర్‌లో సమర్పించడం జరిగిందన్నారు. మండల్ కమిషన్ 3,743 బీసీ కులాలను గుర్తించిందన్నారు. బీసీల అభివృద్ధికి 40 సిఫార్సులు చేసిందని తెలిపారు. బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు 1990లో అమలు చేశారన్నారు. బీపీ మండల్ ఆశయాలు, ఆలోచన విధానాలను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర కో–కన్వీనర్లు జి. శ్రీనివాసులు, డి.మర్రిస్వామి, మావిటి శ్రీరాములు, ఎల్లప్ప, ఆర్.మల్లికార్జున, జి.రామాంజనేయులు, డి.వరదరాజులు, రమణ, రాజారావు, సుగుమంచి శ్రీనివాసులు, రవి పాల్గొన్నారు.

'సంఘానికి వ్యతిరేకంగా నడుచుకోవద్దు'



మాట్లాడుతున్న టీపీ వరప్రసాదరెడ్డి

అనంతపురం కల్చరల్: ఎంతో క్రమశిక్షణాయుతంగా ఉండే చర్చిల్లో నిరంకుశంగా వ్యవహరించొద్దని గాస్పల్ హాల్ అసెంబ్లీ చర్చి సంఘ కాపరి రెవరెండ్ టీపీ వరప్రసాదరెడ్డి అన్నారు. ఆదివారం చర్చిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చర్చి నియమ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించినందున జీహెచ్ ఫిలిఫ్, విజయ్‌కుమార్‌ను బహిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. నిరంకుశ ధోరణిలో వారు అనేక అక్రమాలకు పాల్పడటం విచారకరమన్నారు. చర్చి నిధులను పక్కదోవ పట్టిస్తున్నందున విధి లేక చర్యలు తీసుకోవాల్సివచ్చిందన్నారు. పాత బ్యాంకు ఖాతాలను కాదని వారు మరొక ఖాతా ద్వారా రూ.40 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసుకున్నారని తెలిపారు. అది చెల్లదని బ్యాంకు వారికి లేఖ రాసినట్లు గుర్తు చేశారు. అలాగే అక్రమాలకు పాల్పడిన వారు వేరే చర్చిలో ఈ నిధులు వాడటం దుర్మార్గమన్నారు. వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం పెద్దలు ఆదినారాయణ, ఆసాఫ్ హెరాల్డ్, దేవవరం, కాంతి ఐజాక్, రూబెన్, కాంతి జాన్ వెస్లీ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దళిత వాడల్లో సౌకర్యాలు కల్పించాలి



మాట్లాడుతున్న ఐద్వా, ప్రజా సంఘాల నాయకులు

ఆత్మకూరు: ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన సామాజిక చైతన్య యాత్ర ఆదివారం మండలంలోని ఆత్మకూరు, వడ్డుపల్లి, తలుపూరు గ్రామాలకు చేరుకుంది. ఈ సందర్భంగా కేవీపీఎస్ ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రమ్మ మాట్లాడుతూ.. ఐద్వా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 14 వరకూ జిల్లా వ్యాప్తంగా జీపుయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా దళిత గిరిజన సామాజిక వర్గాలకు కనీస సౌకర్యాల సాధనకు ఈ జీపు యాత్ర చేపడుతున్నట్లు పేర్కొన్నారు. దళిత వాడల్లో ఇప్పటికీ తాగునీరు, వీధి లైట్లు, మరుగుదొడ్లు, ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలు, శ్మశానవాటికలు లేవని తెలిపారు. మహిళలపై వేధింపులు, అత్యాచారాలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి శివశంకర్, రాజేశ్వరమ్మ, వెంకటమ్మ, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి



పాటలు పాడుతున్న గాయనీ గాయకులు

అనంతపురం కల్చరల్: ఔత్సాహిక కళాకారులకు ఇవ్వాల్సిన ప్రోత్సాహాన్ని తెలియజేస్తూ పండుగ వాతావరణంలో జిల్లా గాయనీ గాయకులు మధుర గీతాలతో మంత్రముగ్ధులను చేశారు. పద్మశ్రీ ఘంటసాల సాంస్కృతిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం 'బృందావనమది అందరిది గోవిందుడందరివాడేలే ' పేరిట ఆహ్లాద భరిత సినీ గీతాల ఆలాపన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక హౌసింగ్ బోర్డులోని ఘంటసాల స్మారక మందిర ప్రాంగణంలో పాత పాట పర్ణశాల గాయనీ గాయకుల బృందం ప్రతినిధులు జగర్లపూడి శ్యామసుందర శాస్త్రి, నజుందప్పతో పాటూ డీఆర్వో మలోల పాటలతో ఆహూతులను ఆకట్టుకున్నారు. సంగీత ప్రియుల కోసం ప్రతి సందర్భాన్ని ఆహ్లాదకర వాతావరణంలో ఘంటసాల స్మారక విగ్రహం వద్ద ఔత్సాహిక గాయకులకు అవకాశాలు ఇస్తుండటం స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం సతీష్, రంగస్వామి, హరిత, నవోమి, బృంద, రమారెడ్డి, విజయలక్ష్మి, గోవర్ధన్ తదితరులు తెలుగు, హిందీ గీతాలను ఆలపించారు.

ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ



విజయ సంకేతం చూపుతున్న తేజ కళాశాల విద్యార్థులు, యాజమాన్యం

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ ఫలితాల్లో అనంతపురంలోని 'తేజ జూనియర్ కళాశాల' విద్యార్థులు సత్తా చాటారు. బైపీసీ విభాగంలో రమ్య 991 మార్కులతో మెరిసింది. విజయలక్ష్మి 987, ఫాతిమా సుమయా 986, నవనీద్ కృష్ణ 986, మానస 984, వినుత 983 మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్ బైపీసీ విభాగంలో రేష్మవి 435, కృష్ణ చైతన్య 430, నవనీత 430 మార్కులతో ప్రతిభ కనబరిచారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో కీర్తిశ్రీ 465, షమీరా 465, ఇందువర్ధన్ రెడ్డి 464, నారాయణరెడ్డి 464, లోహిత్ రెడ్డి 463, నితిన్ 463, సతీష్‌రెడ్డి 462, వరుణ్ సందేశ్ 462, హరిప్రియ రెడ్డి 462, చంద్రపౌర్ణమి 462, ఎం.కావ్య 462, యశ్వంత్‌రెడ్డి 461, పూజితరెడ్డి 460, హేమంత్ కుమార్ 460, రాకేష్ 460 మార్కులు సాధించారు. వీరిని తేజ విద్యాసంస్థల డైరెక్టర్ తేజేశ్వర్ రెడ్డి, చైర్‌పర్సన్ ఉమాదేవి, అకడమిక్ డైరెక్టర్ అనిల్ కుమార్ తదితరులు అభినందించారు. అనంతపురం రూరల్ తాటిచెర్లకు చెందిన భీమిరెడ్డి చంద్ర ఓబుళరెడ్డి కూతురు భీమిరెడ్డి లాస్య సంహిత జూనియర్ ఇంటర్‌లో 464 మార్కులు సాధించింది. ఇదే గ్రామానికి చెందిన గువ్వల గోవిందరెడ్డి కుమారుడు గువ్వల శషాంక్‌రెడ్డి జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 462 మార్కులు సాధించాడు. నగరానికి చెందిన ప్రభుత్వ టీచరు బి.ఓబిరెడ్డి కూతురు బి.డీనారెడ్డి జూనియర్ ఇంటర్ ఎంపీసీ గ్రూపులో 462 మార్కులు సాధించింది. నగరంలోని కాంగ్నిజెంట్ కళాశాలలో చదువుతున్న రూరల్ మండలం పాపంపేటకు చెందిన నారాయణ కూతురు యాగంటి ఉదయశ్రీ ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 461 మార్కులు సాధించింది.

ఔత్సాహిక కళాకారులకు ప్రోత్సాహం



గాజుల పద్మజను సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: స్థానిక లలిత కళాపరిషత్తులో ఆదివారం జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన గురుప్రసాద్, కందుకూరు వీరేశలింగం రాష్ట్రస్థాయి అవార్డు కమిటీ మెంబర్‌గా ఎంపికైన పద్మజను జిల్లా రంగస్థల కళాకారులు, సీనియర్ నటీనటులు ఘనంగా సత్కరించారు. ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా లలిత కళాపరిషత్తు వినూత్న కార్యక్రమాలను రూపొందిస్తున్నట్లు ఎల్కేపీ అధ్యక్ష కార్యదర్శులు పి.గురుప్రసాద్, గాజుల పద్మజ తెలిపారు. ఎల్కేపీ ఉపాధ్యక్షులు సంగాల నారాయణ స్వామి, రామగోవింద సాగర్ మాట్లాడుతూ.. పద్మజ కార్యదర్శిగా వచ్చిన తర్వాత రంగస్థల కార్యక్రమాల రూపురేఖలు మారిపోయాయన్నారు. కళాకారులకు అవకాశాలు మెండుగా వస్తున్నాయని తెలిపారు. త్వరలో నంది నాటక అవార్డులు సాధించే దిశగా సరికొత్త నాటకాన్ని రూపొందిస్తున్నామన్నారు.

దళితులపై దాడులు దుర్మార్గం

అనంతపురం టవర్‌క్లాక్: దళితులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అక్కులప్ప కోరారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మమతమ్మ ఆశ్రమం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కులప్ప మాట్లాడుతూ.. సర్వధర్మ ఆశ్రమ పీఠాధిపతి మమతమ్మ ఆధ్వర్యంలో కర్ణాటకలోని మాండ్యా జిల్లా బెళగోళలో నవరాత్రుల సందర్భంగా భక్తులు పూజలు చేస్తుంటే కబీర్ కిరణ్ అనుచరులు దాడి చేశారన్నారు. మహిళలు అని కూడా చూడకుండా చేతులు విరగ్గొటారని పేర్కొన్నారు. వారిపై అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందన రాలేదన్నారు. దాడి చేసిన వారిలో అనంతపురం జిల్లాకు చెందిన వారు కూడా ఉన్నారని తెలిపారు. వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరారు. కార్యక్రమంలో బాధితురాలు లక్ష్మి, రామాంజనేయులు, లక్ష్మణ్ మూర్తి, గంగమ్మ, శ్రీలత, దివావాణి తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీతపై ప్రచారం



భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

రాప్తాడు: భగవద్గీత సంపూర్ణ మానవ జీవన సమగ్రసారం. ఇందులోని అంశాలను చదివి ఆచరిస్తే లోకం స్వర్గధామం అవుతుందని త్రైత సిద్ధాంత ప్రబోధసేవా సమితి ఇందూ జ్ఞానవేదిక జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున పెర్కొన్నారు. ఆదివారం మండలంలోని అయ్యవారిపల్లిలో త్రిమత గురువు, శతాధిక గ్రంథకర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత భగవద్గీత, 100 రకాల త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవద్గీతను ప్రతి ఒక్కరూ జీవితంలో ఒక సారి అయినా చదివి, మారమార్గం తెలుసుకోవాలన్నారు. ఫలితం ఆశించకుండా పని చేసుకుంటూ వెళ్తే ఫలితం అదే వస్తుందని భగవద్గీతలో చెప్పారన్నారు. అనంతరం భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూర్యనారాయణ రెడ్డి, చిట్టిబాబు, నాగిరెడ్డి, నీలావతి, నాగేశ్వరి, లక్ష్మీదేవి, గౌరి ప్రియ, పాలాక్షి, చిరంజీవి, భాస్కర్ రెడ్డి, యువశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం



మట్టలతో ర్యాలీ చేపట్టిన క్రైస్తవులు

అనంతపురం కల్చరల్: నగరంలోని పలు ప్రార్థనా మందిరాల్లో మట్టల ఆదివారం వేడుకలు జరుపుకున్నారు. గుడ్ ఫ్రైడే పర్వదినానికి ముందు వచ్చే ఆదివారాన్ని మట్టల ఆదివారంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. జిల్లా కేంద్రంలోని అరవింద నగర్ సీఎస్‌ఐ చర్చిలో వందలాది మంది క్రైస్తవులు మట్టలతో ర్యాలీ చేపట్టారు. సంఘం కాపరి పాస్టర్ బెన్హర్‌బాబు పండుగ ప్రాశస్త్యాన్ని తెలియజేశారు. సంఘ సెక్రటరీ జాన్ సుధీర్, సునీల్‌కుమార్, చంద్రశేఖర్ జాన్, జడ్ దేవరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే సప్తగిరి సర్కిల్ సమీపంలోని ఎస్‌బియూ చర్చిలో రెవరెండ్ సంపత్‌కుమార్, కళాకారుల కాలనీలోని రేమా చర్చిలో పాస్టర్ మనుష్యే మట్టల ఆదివారాన్ని సంప్రదాయరీతిలో జరుపుకుని ఆనాటి విశేషాలను వివరించారు. వీధుల్లో ఈత మట్టలు పట్టుకుని సామూహిక ప్రార్థనలు, భక్తిగీతాలు ఆలపిస్తూ దేవుడిని స్తుతించారు.

రేపు నీటి సరఫరాకు అంతరాయం

అనంతపురం కార్పొరేషన్: హంసపల్లి వద్ద ఉన్న పీఏబీఆర్ డ్యాం ప్రధాన నీటి పైప్‌లైన్ మరమ్మతుల్లో భాగంగా ఈనెల 15న (మంగళవారం) నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని కమిషనర్ బాలస్వామి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు సహకరించాలని కోరారు.

ఘనంగా దస్తగిరి స్వామి ఉరుసు



దర్గా వద్ద భక్తుల సందడి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం చియ్యేడులో వెలిసిన ఇమామ్‌వలి దస్తగిరి స్వామి ఉరుసు ఆదివారం ఘనంగా జరిగాయి. కుల, మతాలకు అతీతంగా భక్తులు తరలివచ్చారు. గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాలు, అనంతపురం నగరం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి దర్గాలో చదివింపులు చేయించారు. ఉదయం నుంచి రాత్రి వరకూ దర్గా ఆవరణ భక్తులతో కిటకిటలాడింది. రాత్రి 'పంచరత్నాలు' అనే నాటక ప్రదర్శన జరిగింది.

శ్రీకృష్ణ దేవరాయల జయంతిని అధికారికంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న రాయలసీయ బలిజ మహాసంఘం నాయకులు

అనంతపురం టవర్‌క్లాక్: శ్రీకృష్ణ దేవరాయల జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని రాయలసీయ బలిజ మహా సంఘం అధ్యక్షుడు శంకరయ్య కోరారు. ఆదివారం స్థానిక శ్రీనివాస కళ్యాణ మంటపంలో సంఘం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కొంత మంది నాయకుల జయంతులు, వర్ధంతులు అధికారికంగా నిర్వహిస్తామని ప్రకటించారన్నారు. అయితే అందులో బలిజల ఆరాధ్యదైవమైన శ్రీకృష్ణ దేవరాయుల జయంతి, వర్ధంతి, పట్టాభిషేకం నిర్వహిస్తామని ప్రకటించక పోవడం శోచనీయమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 70 లక్షల మంది బలిజలు ఓటు వేయడంతోనే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. ఇప్పటికైనా గుర్తించి ప్రకటించాలని కోరారు. త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పాముదాయి వెంకటేశ్వర్లు, సాయి ప్రసాద్, విజయభాస్కర్, రమణ, శ్రీధర్, ప్రభాకర్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ఆత్మకూరు: మండలంలోని వడ్డుపల్లి గ్రామంలో ఆదివారం జిల్లా కేంద్రానికి చెందిన సాయిరత్న ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్, కీళ్ల నొప్పులు, గుండె సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలత, సర్పంచ్ లక్ష్మీనారాయణ రెడ్డి పాల్గొన్నారు.